## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీలోని బోయిడువీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గురువారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

### 'ఓపెన్'లో ప్రవేశానికి గడువు పెంపు

గరుగుబిల్లి: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశానికి గడువును ప్రభుత్వం పెంచిందని సార్వత్రిక విద్యాపీఠం మండల సమన్వయకర్త పి.శ్రీనివాసరావు నాయుడు, పి.సదాశివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 15వ తేదీలోగా పదో తరగతి, ఇంటర్ ప్రవేశానికి ఫీజులు చెల్లించవచ్చునన్నారు. రూ.200లు అపరాధ రుసుంతో ఈ నెల 25లోగా ఫీజును చెల్లించవచ్చునన్నారు.

### సన్మానం..

భామిని: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన భామిని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ప్రిన్స్‌పాల్ ఆర్.శివకుమార్, మ్యాథ్స్ టీచర్ సవర జానకీరావులను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పడాల భూదేవి, తదితరులు మండల కేంద్రంలో గురువారం సన్మానించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఏకలవ్య పాఠశాల భవనాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎస్. ప్రకాశరావు, కె. గోవిందరావు, ఎ.దశరథనాయుడు, కె.రాజారావు, వై.ఢిల్లీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా రాధాష్టమి వేడుకలు



ఊయల ఊపుతున్న భక్తులు

భామిని: మండలంలోని లివిరిలో వెలిసిన శ్రీగోపీనాథా రాధాకృష్ణుల సన్నిధిలో గురువారం రాధాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూల ఊయలలో రాధారాణి ఉత్సవ విగ్రహాలు ఉంచి పూజలు చేశారు. పాడలి నుంచి వచ్చిన వన మహాలక్ష్మి భజన బృందం భక్తిగీతాలతో అలరించారు.

### చెత్త తరలించాలంటూ ఆందోళన



నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పాలకొండ: నగర పంచాయతీలోని మార్కెట్ సమీపంలో ఉన్న చెత్తను తక్షణమే తొలగించాలని సీఐటీయూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ.. నగరంలోని చెత్త అంతా సేకరించి స్థానిక మార్కెట్ సమీపంలో వేస్తున్నారని, దీంతో ప్రజలు రోగాల భారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ వి.ఇందిర, కాద రాము, సంజీవి, లలిత, భాను, తదితరులు పాల్గొన్నారు.

### జగనన్న మేలు మరువలేం..

- ద్రోణి నిర్మాణంపై హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



నీటిద్రోణి నిర్మాణ పరిశీలనలో బాలేరు ప్రజాప్రతినిధులు, రైతులు

భామిని: బాలేరు సమీపంలోని వంశధార వరద కాలువపై రూ. 4 కోట్లతో నీటిద్రోణి నిర్మాణానికి పూనుకున్న మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరువలేమని మండల రైతులు అన్నారు. నీటి సంఘ మాజీ అధ్యక్షుడు రొక్కం రామారావు ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్, మేడిబోయిన చలపతి, రైతులు నోటిద్రోణి నిర్మాణాన్ని గురువారం పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, 2016 నుంచి వరద కాలువపై నీటిద్రోణి నిర్మాణానికి పోరాటం చేస్తున్నా అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి రూ. 4 కోట్లు విడుదల చేయించారు. 200 ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆనందం వ్యక్తం చేశారు.

# ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు

- అవసరమైన వారికి శస్త్రచికిత్సలు
- గురువారం ఒక్కరోజే ఐదు ఆపరేషన్లు
- సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్న రోగులు

సీతంపేట: మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించారు. పలువురు స్పెషలిస్టు వైద్యులను సైతం నియమించారు. అలాగే ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. రూపాయి ఖర్చు లేకుండా అవసరమైన రోగులకు శస్త్రచికిత్సలు చేస్తున్నారు. సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డీవీ శ్రీనివాసరావు నేతృత్వంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ జయకృష్ణ, మత్తు డాక్టర్ రత్నాకర్ గురువారం ఒకే రోజు ఐదుగురికి ఎపిగ్యాస్టిక్ హెర్నియ, ఇన్సిషనల్ హెర్నియ, హిమరాయిడ్స్, వెరికోసి, బ్రెస్ట్ ఎప్సిస్ ఆపరేషన్లు చేశారు. ఈ నెలలో ఇప్పటివరకు ఈ ఆస్పత్రిలో 18 శస్త్రచికిత్సలు చేయడం విశేషం. ఆపరేషన్లు చేయడంతో పాటు రోగులను వైద్యులు కొన్ని రోజులు పరీక్షించి సేవలు అందిస్తుండడంపై రోగులు, వారి బంధువులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇవే ఆపరేషన్లకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వేలాది రూపాయల ఖర్చు అవుతుంది. ఏరియా ఆస్పత్రిలో పైసా ఖర్చు లేకుండా మెరుగైన సేవలందిస్తున్నారని పలువురు చెబుతున్నారు.

**గిరిజనులకు సేవ చేయడం ఎంతో ఆనందం..**



గిరిజనులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఎటువంటి ప్రమాదాలు జరిగినా, వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన శస్త్రచికిత్సలు చేస్తున్నాం. కార్పొరేట్‌కు దీటుగా ఇక్కడ వైద్యసేవలు అందిస్తున్నాం.

– డీవీ శ్రీనివాసరావు, సివిల్ సర్జన్ స్పెషలిస్ట్, ఏరియా ఆస్పత్రి, సీతంపేట



యువకుడికి శస్త్రచికిత్స చేస్తున్న సర్జన్‌లు



కొత్తవీధి గణపతి మండపం వద్ద దీపాలు వెలిగించిన మహిళలు

## వైభవంగా దీపార్చన ..



షిర్డీసాయినగర్‌లో మహా గణపతికి 108 రకాల ప్రసాదాల నివేదన

పాలకొండ రూరల్: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాల్లో గురువారం ప్రత్యేక పూజలతో పాటు వసంతోత్సవాలు, దీపార్చన కార్యక్రమాలు వైభవంగా చేపట్టారు. స్థానిక కొత్తవీధిలో ఏర్పాటు చేసిన నందివాహన సహిత మహాశివ గణపతి మండపంలో దీపారాధన నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. అలాగే షిర్డీసాయినగర్‌లో గణపతికి 108 రకాల ప్రసాదాలను భక్తులు నివేదించారు. వీవర్స్ కాలనీ, ఇందిరానగర్ కాలనీల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

## ఈకేవైసీ తప్పనిసరి



ఎల్విన్‌పేటలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ

గుమ్మలక్ష్మీపురం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పంటలను నమోదు చేసుకున్న రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని కురుపాం ఏడీఏ ఎ.నిర్మల జ్యోతి అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేటలో గల మిలెట్ ప్రొసెసింగ్ యూనిట్‌ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కురుపాం డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో అన్ని రకాల పంటలు 1.500 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయని, ఇప్పటి వరకు 78,340 ఎకరాలకు సంబంధించి ఈ క్రాప్ నమోదు చేయించుకోగా.. 34వేల ఎకరాలకు సంబంధించి రైతులు ఈకేవైసీ చేయంచుకున్నారన్నారు. మిగతా రైతులంతా ఈ నెల 15లోగా ఈ క్రాప్‌తో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఇటీవల వచ్చిన తుఫాన్ ప్రభావం పత్తి పంటకు ఎంతో ఉపయోగపడిందన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ ఉన్నారు.

## నేడు మండల సమావేశం

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన మండల సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జి.పైడితల్లి గురువారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

## రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

భామిని: అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా రైతులకు అందించాల్సిన పెట్టుబడి సాయం రూ. 20 వేలను తక్షణమే చెల్లించాలని ఏపీ రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాలేరు సచివాలయ వ్యవసాయ సహాయకుడ్ని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో తుఫాన్, కరువుతో పాడైన పంటలకు బీమా వర్తింపజేయడంతో పాటు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయాలని కోరారు. అలాగే వ్యవసాయ బోర్లకు మీటర్లు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల రైతు సంఘ నాయకులు కొప్పర మిన్నారావు, జక్కం వెంకటరావు, కె.బాబూరావు, జి. జగన్నాయకులు, కె. గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్ దృష్టికి రైతు సమస్యలు

పాలకొండ రూరల్: వ్యవసాయ ఆధారితమైన నియోజకవర్గంలో ఏటా సాగునీటి సమస్యతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఏపీ రైతు సంఘ నాయకులు సబ్ కలెక్టర్ యశ్వంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రైతు సమస్యలు, సాగునీటి వనరుల దుస్థితిని ఈ సందర్భంగా వివరించారు. సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ గేమ్స్‌కు నిధుల లేమి..

- దాతల సాయంతో క్రీడాపోటీల నిర్వహణ
- మండిపడుతున్న నిర్వాహకులు



మండుటెండలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



ఖోఖో ఆడుతున్న బాలికలు

వీరఘట్టం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నిర్వహించిన స్కూల్ గేమ్స్‌కు ప్రభుత్వం ఎటువంటి నిధులు విదల్చకపోవడంపై నిర్వాహకులు పెదవి విరుస్తున్నారు. మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మండుటెండలో సైతం ఎంతో ఉత్సాహంగా పోటీల్లో తలపడ్డారు. మండల కేంద్రానికి చెందిన నాయకుడు జామి లక్ష్మీనారాయణ రూ.5 వేలు, పాఠశాల హెచ్‌ఎం రూ.5 వేలు విరాళం ఇవ్వడంతో పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. ఈ భోజనాలు నచ్చక చాలా క్రీడాకారులు ఆకలితోనే ఆటలాడాల్సి వచ్చింది. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎటువంటి చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**నియోజకవర్గ స్థాయి పోటీలకు 50 మంది ఎంపిక..**

మండల స్థాయి క్రీడా పోటీల్లో సత్తాచాటిన 50 మందిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు మండల స్పోర్ట్స్ అధికారి ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, తదితర క్రీడల్లో అండర్–14 విభాగంలో 25 మందిని, అండర్–17 విభాగంలో 25 మంది బాలబాలికలను ఎంపిక చేసామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆర్.ఆనందరావు, టీడీపీ నాయకుడు జామి లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం బి.సాంబర, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ గౌరవాధ్యక్షుడు మజ్జి రామకృష్ణ, అన్ని పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు



వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని ఎన్‌కే రాజపురం రామాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండపంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు వెన్నపు శ్రీనివాసరావు, నీలాపు శ్రీనివాసరావు, వెలమల మన్మధరావు, కడగల వెంకటరమణ, తుమ్మగుంట శంకరరావు, బాబ, తదితరులున్నారు.

## వరద బాధితుల సాయం

పాలకొండ రూరల్: విజయవాడ వరద బాధితులకు ప్రతిఒక్కరూ తమ వంతు సాయం అందించి ఉదారత చాటుకోవాలని పాలకొండ పట్టణ పౌరహక్కుల సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానికుల నుంచి విరాళాలు, దుస్తులు సేకరించారు. పట్టణానికి చెందిన జీఆర్ రెడిమేడ్స్‌కు చెందిన నిర్వాహకులు గోవిందరావు పెద్దెత్తున చీరలు, దుప్పట్లు, పిల్లలకు సంబంధించిన దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కె.చౌదరినాయుడు, బి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు

- వ్యవసాయ శాఖ ఏడీఏ రత్నకుమారి



కషాయాలను తయారు చేసి చూపిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

వీరఘట్టం: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చునని వ్యవసాయశాఖ ఏడీఏ కె.రత్నకుమారి సూచించారు. చలివేంద్రి గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చీడపీడల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అగ్నాస్త్రం, జిల్లేడు కషాయాలను ఎలా తయారు చేయాలో చేసి చూపించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి జక్కువ సౌజన్య, మారుతీ సింహాచలం, ఏఏఓ సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

## కోతకు గురైన కోపువలస - వంబరెల్లి రహదారి



కొట్టుకుపోయిన బీటీ రహదారి

సీతంపేట:

కోపువలస నుంచి వంబరెల్లి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. ఆరు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి గతంలో రూ. 3 కోట్లు మంజూరు చేశారు. అయితే పనులు అర్ధంతరంగా నిలిచిపోవడం.. చేసిన పనుల్లో కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఐటీడీఏ పీఓ స్పందించి పనులు చేపట్టాలని సర్పంచ్ సుశీల కోరారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించరూ...



పంచాయతీ ఈఓ రవికి వినతిపత్రం ఇస్తున్న కస్పావీధి వాసులు

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీలోని కస్పావీధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు పంచాయతీ ఈఓ ఎం.రవిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. వీధిలో సుమారు వంద కుటుంబాలు నివాసం ఉండగా.. కేవలం రెండు కుళాయిలు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రతిరోజూ తాగునీటి కోసం కొట్లాటలు జరుగుతున్నాయని, మరిన్ని కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు.

## హెచ్ఐవీపై అవగాహన



కురుపాం వారపు సంతలో హెచ్ఐవీపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలో గురువారం జరిగిన వారపు సంతలో మీకు తెలుసా.. పేరుతో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైడీఓ నెట్‌వర్క్ అవుట్ రీచ్ సంస్థ ప్రతినిధి ఎ.గీతారాణి మాట్లాడుతూ 1097 టోల్‌ఫ్రీ నంబరుతో పాటు హెచ్ఐవీ/ఎయిడ్స్, సుఖ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ సోకిన వారిని చిన్నచూపు చూసినా.. హేళన చేసినా చట్టరీత్యా శిక్షార్హులని, అటువంటి వారిపై చర్యలకు డిమాండ్ చేయాల్సి ఉంటుందన్నారు.

## 124 మందికి వైద్య పరీక్షలు



నేత్ర చికిత్సలు చేస్తున్న శంకర ఫౌండేషన్ ఆప్తాలమిస్ట్

వీరఘట్టం: మండల కేంద్రంలోని సత్యసాయి సేవా సమితిలో బద్దుమసంగి ప్రగతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 124 మందికి పరీక్షలు నిర్వహించినట్లు సొసైటీ అధ్యక్షుడు పైల హరిబాబు తెలిపారు. ఇందులో 74 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. విశాఖలోని శంకర్ ఫౌండేషన్‌లో శుక్ర, శని వారాల్లో ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కో ఆర్డినేటర్ సీహెచ్ వెంకట్, కిల్లాడి భీముడు, గెంబలి మురళి, కందుల లక్ష్మి, మద్ది వరహానర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

## రావాడ రామభద్రపురంలో ఆటల పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం తిరుపతిరావు

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ రామభద్రపురంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) అండర్ 14, 17 బాల బాలికల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలు గురువారం జరిగాయి. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను హెచ్‌ఎం ఎస్.తిరుపతిరావు ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు బి.మాధవరావు, వార్డెన్ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## జీఓ 115 రద్దు చేయాలి



కురుపాం సీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): జీఓ 115ని రద్దు చేయాలని కురుపాం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న స్టాఫ్‌నర్సులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆస్పత్రి ఆవరణలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అలేఖ్య, విజయమ్మ, అనంతలక్ష్మి తదితరులు మాట్లాడుతూ ఏఎన్‌ఎంలకు ఇంటెన్సిఫైడ్ జీఎన్‌ఎం పేరుతో నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి స్టాఫ్‌నర్సు ఉద్యోగాలు ఇచ్చేందుకు జీఓ 115ను తీసుకురావడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. 115 జీఓను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వైద్యులు సునీల్‌కుమార్, సుకృత, మౌనిక వారికి మద్దతు తెలిపారు.

## కళాకారులను ప్రోత్సహిద్దాం..



శంకరరావును సన్మానిస్తున్న సేవాసమితి సభ్యులు

పాలకొండ రూరల్: స్థానిక కళాకారులను ప్రోత్సహించడం ద్వారా అంతరించిపోతున్న జానపద, పౌరాణిక కళలకు జీవం పోయవచ్చని దక్షిణాముఖ ఆంజనేయస్వామి సేవాసమితి నిర్వాహక సభ్యుడు పాలవలస ధవళేశ్వరరావు అన్నారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయుడు, జల్లెళ్ళముడి అమ్మ కళాసమితి నిర్వాహకుడు బౌరోతు శంకరరావును గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరరావు మాట్లాడుతూ, వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన శంకరరావు కళలను ప్రోత్సహించడంతో పాటు పలువురు కళాకారులను తయారుచేయడంలో చూపిస్తున్న శ్రద్ధ మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, కళాపోషకులు, ప్రజా ప్రతినిధులు వి.గోవిందరావు, ఆర్.రాములు, కె.జనార్ధనరావు, జి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరి



వాహనదారుల రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ

గుమ్మలక్ష్మీపురం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్ అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేట చెక్‌పోస్టు వద్ద గురువారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల రికార్డులు తనిఖీ చేశారు. రికార్డులు లేని వారికి అపరాధ రుసుం విధించారు. సురక్షితంగా గమ్య స్థానానికి చేరుకోవాలంటే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, పరిమితి వేగంతోనే వాహనాన్ని నడపాలని సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం..



భామిని: బత్తిలిలో వినాయక ఊరేగింపులో చిన్నారుల సందడి



గుమ్మలక్ష్మీపురం: నిమజ్జన కార్యక్రమంలో నృత్యాలు చేస్తున్న భద్రగిరి రామాలయం కాలనీ వాసులు

వినాయక నిమజ్జనోత్సవాలు వాడవాడలా గురువారం ఘనంగా నిర్వహించారు. చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రత్యేక పూజలు చేపటారు. విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉంచి మేళతాళాల నడుమ ఊరేగించి చెరువులు, నదుల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువత నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. – పాలకొండ/కురుపాం నెట్‌వర్క్

## ఇంకెన్నాళ్లీ దుస్థితి



కూనేరు సంత వద్ద చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారిపై దిగబడ్డ వ్యాన్



గుమడ వద్ద కూరుకుపోయిన లారీ

పార్వతీపురం – కూనేరు అంతర్రాష్ట్ర రహదారి పూర్తిగా గోతుల మయమై వాహనచోదకులకు చుక్కలు చూపిస్తోంది. గుమడ నుంచి కూనేరు వరకు సుమారు ఐదు చోట్ల గురువారం వాహనాలు దిగబడిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. 108 అంబులెన్సు కూడా నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోజూ ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నామని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ ఏ వాహనం ఏ గోతిలో దిగబడిపోతుందో తెలియని పరిస్థితుల్లో ఈ మార్గంలో ప్రయాణమంటేనే నరకం చూస్తున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి దుస్థితిపై పలుసార్లు వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేసినా చర్యల్లేవు. ఇప్పటికైనా ఈ రహదారిని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – కొమరాడ